Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 108 | Friday 28.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 108 | శుక్రవారం 28. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

నిర్వాసితులను అన్ని విధాలుగా...

## ఆదుకుంటాం





### మా ప్రభుత్వంలో మాయ మాటలు...
### చెప్పేవాళ్లు లేరు: పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు
### పోలవరంలో చంద్రబాబు పర్యటన- నిర్వాసితులతో ముఖాముఖి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** “పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను కోరుతున్నా. అందుకు అవసరమైన సిబ్బందిని ఇస్తాం” అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

**ఖర్చుచేసే ప్రతిపైసా నిర్వాసితులకే చెందాలి...** : 2014లో తాము అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వాసితుల గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదని విమర్శించారు. కనీసం వారి సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవన్నారు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోదీని ఒప్పించినట్లు తెలిపారు. వీలైనంత వరకు నిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లామన్నారు. రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని మండిపడ్డారు. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు.

**గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారు... :**

తాను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశానని, 33 సార్లు ప్రాజెక్టును సందర్శించానని ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే నిర్వాసితులు ఈ పాటికే స్థిరపడేవారని తెలిపారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ. 2,500 కోట్ల ఆదాయం వచ్చేదన్నారు. దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగిపోయిందని తెలిపారు.

**మా ప్రభుత్వంలో**

మిగతా 2 లో

కోదండరామస్వామివారి...

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం




తిరుపతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :**

తిరుపతి శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కంకణ బట్టర్ భరత్ కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో మేష లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణ, రామనామ జపముల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతోపాటు

మిగతా 2 లో

పాస్టర్ ప్రవీణ్ మరణంపై ఫాస్ట్ ట్రాక్...

## విచారణ జరిపించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన షర్మిల




అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మరణంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించలేదని, పక్కా ప్రణాళికతో హత్య చేశారని ఆమె ఆరోపించారు. అది హత్యే అని చెప్పడానికి సంఘటనా స్థలంలో అనేక ఆధారాలు కనిపించాయని ఆమె పేర్కొన్నారు. ప్రవీణ్ మరణంపై ఆయన కుటుంబ సభ్యులతో పాటు అనుచరులు, తోటి పాస్టర్లు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని షర్మిల చెప్పారు. ప్రవీణ్ మృతిపై నెలకొన్న అన్ని సందేహాలను నివృత్తి చేసేలా ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు

మిగతా 2 లో

ఏపీ హైకోర్టులో...

## రజనికి చుక్కెదురు

విడదల రజనిపై అవినీతి ఆరోపణలు

రూ.2.2 కోట్లు వసూలు చేశారంటూ ఏసీబీ కేసు

ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో రజని పిటిషన్

మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వైసీపీ నాయ కురాలు, మాజీ మంత్రి విడదల రజని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం నాడు విచారణను వాయిదా వేసింది. అవినీతి ఆరోపణల కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని

మిగతా 2 లో

మహిళలు తలుచుకుంటే అద్భుతాలు...

## సృష్టిస్తారు

అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారు - మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే సీఎం చంద్రబాబు డ్వాక్రా తెచ్చారు

కుప్పంలో ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి



కుప్పం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, మహిళలకు అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారని నారా భువనేశ్వరి అన్నారు. మహిళలు వారి కాళ్లపై వారు నిలబడి ఆర్థికంగా బలోపేతం అవడం కోసమే సీఎం చంద్రబాబు డ్వాక్రా స్థాపించారని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు.

మిగతా 2 లో

హిందూ ధర్మంపైన, ఆలయాల పరిరక్షణపైనా...

## మాట్లాడే హక్కు ఉందా?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ సంచలన వ్యాఖ్యలు!

కాశినాయన క్షేత్రాన్ని కూల్చేస్తుంటే డిప్యూటీ సీఎంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఫైర్

ప్రసిద్ధ కాశినాయన క్షేత్రంలో కూల్చివేతల నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా పోస్టు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మంపై, ఆలయాల పరిరక్షణపైనా మాట్లాడే హక్కు లేదన్నారు. కాశినాయన క్షేత్రాన్ని అధికా

మిగతా 2 లో

# సంపాదకీయం

## జమిలీకి జై కొట్టేస్తున్నారు...

దేశంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది భారతీయ జనతా పార్టీ. 2014, 2019, 2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టింది. అటు చాలా రాష్ట్రాల్లో సైతం రాగలిగింది. ఇంకొన్ని రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారాన్ని పంచుకుంటుంది. ఎలా చూసినా బిజెపి బలమైన శక్తిగా ఉంది. అందుకే ఈ శక్తిని పదిల పరుచుకునేందుకు బిజెపి సరికొత్త ప్రయోగం 'జమిలి' వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మాట చాలా రోజులుగా వినిపిస్తోంది. తెర వెనుక కార్యాచరణ జరుగుతోంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే మాత్రం బిజెపి జమిలి వైపేనని తేలిపోతోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఆశించిన ఫలితాలు రాలేదు. బిజెపి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ దాటుతుందని అంతా అంచనా వేశారు. కానీ జనాలు అవకాశం ఇవ్వలేదు. మ్యాజిక్ ఫిగర్ కు 40 సీట్లు దూరంగా బిజెపి ఉండిపోయింది. అటువంటి సమయంలోనే తెలుగుదేశం పార్టీతోపాటు నితీష్ పార్టీ అండగా నిలిచింది. అప్పుడే జమిలీ ఎన్నికల ఆలోచనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జమ్మూ కాశ్మీర్ తో పాటు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురయ్యేసరికి జమిలి అంశం పక్కన పెట్టింది బిజెపి. తర్వాత మహారాష్ట్ర, 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రావడంతో జమిలిపై కదలిక వచ్చింది. వచ్చే ఎన్నికల్లో కూడా సత్తా చాటాలని బిజెపి భావిస్తోంది. తద్వారా కాంగ్రెస్ పార్టీకి ఉన్న రికార్డులను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇప్పుడు బిజెపి పరిస్థితి బాగుంది. ఆ పార్టీపై పాజిటివ్ ప్రచారం ఉంది. అందుకే ఇటువంటి సమయంలో జమిలి ఎన్నికల ద్వారా అనుకున్నది సాధించాలని చూస్తోంది. ఇప్పటికే జమిలి బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆరు నెలల పాటు అధ్యయనం కూడా ముగిసింది. బిజెపి పాలిత రాష్ట్రాలే ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో బలమైన మిత్రపక్షాలు కూడా కొనసాగుతున్నాయి. అందుకే జమిలీపై ఏకాభిప్రాయానికి వచ్చి.. ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతోంది బీజేపీ. మరి కాషాయ దళం ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి. ప్రస్తుతం కేంద్రంలో పాలుపంచుకుంటున్న కీలక నేత చంద్రబాబు సైతం జమిలి కి జై కొట్టారు. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగితే ఖర్చు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. ఇది దేశానికి అవసరం కూడా అన్నారు. అయితే బిల్లు ప్రకారం, దేశంలో జమిలి ఎన్నికలు 2034 నుంచి జరిగే అవకాశముంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టరూపం సంతరించుకున్నాక జరిగే సాధారణ ఎన్నికల అనంతరం ఏర్పడే లోక్‌సభ తొలి సిటింగ్ దేకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అపాయింటెడ్ డేగా పిలిచే ఆ రోజు తర్వాత ఏర్పడిన అన్ని అసెంబ్లీలు కూడా లోక్‌సభ కాలపరిమితితోపాటే ముగుస్తాయి. ఆ తర్వాత నుంచి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలన్నీ ఏకకాలంలో జరుగుతాయి. లోక్‌సభగానీ, అసెంబ్లీగానీ పూర్తికాలం ముగియక ముందే రద్దయితే వాటికి 5 ఏళ్ల కాలంలో మిగిలిన సమయానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు పేర్కొంది. అందువల్ల జమిలి విధానం 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఆచరణలోకి వస్తుంది. ఉదాహరణకు 2029 మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం ఏర్పడే 19వ లోక్‌సభ మొదటి సిటింగ్ తేదీని రాష్ట్రపతి జూన్ 1గా నిర్ధరిస్తే ఆ తర్వాత ఏర్పడే అసెంబ్లీలన్నీ ఆ లోక్‌సభతోపాటే ముగుస్తాయి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. 2004 నుంచి కూడా వాటి ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటే జరుగుతున్నందున 2029, 2034లోనూ అదే విధానం కొనసాగుతుంది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు తదుపరి అసెంబ్లీ ఎన్నిక 2028 నవంబరు-డిసెంబరులో జరిగి 2033 నవంబరు వరకూ మనుగడలో ఉంటాయి. 2029లో ఏర్పడే 19వ లోక్‌సభ కాలపరిమితి 2034 మేలో ముగియనున్నందున 2033లో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు, 2034 లోక్‌సభ ఎన్నికలకు మధ్య ఏర్పడే 6 నెలల వ్యవధికి రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. 2028 మే, జూన్ నెలల్లో జరిగే కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ లాంటి రాష్ట్రాల అసెంబ్లీలు 2033 మే, జూన్‌లలో ముగుస్తాయి. 2034తో జరిగే లోక్‌సభ ఎన్నికలతో వీటికి ఏడాది వ్యవధి ఉంటుంది కాబట్టి ఆ ఏడాదికే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా లేదంటే వాటికీ రాష్ట్రపతి పాలన అమలు చేస్తారా అన్నది చూడాలి. మిగిలిన రాష్ట్రాల్లోనూ ముందూ వెనుకా ఎన్నికలు ఉండటంతో ఏం చేస్తారన్నది వేచి చూడాలి. మరోవైపు బీహార్ లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఎన్డిఏ భాగస్వామ్య పక్షం అధికారంలో ఉంది. ఆ అసెంబ్లీ ఎన్నికలతో పాటు జమిలి జరిగితే తప్పకుండా సీఎం నితీష్ కుమార్ ఆహ్వానిస్తారు. అయితే ఈ విషయంలో పక్కా ఆలోచనతో అడుగులు వేస్తోంది భారతీయ జనతా పార్టీ. జమిలి ద్వారా సరికొత్త రికార్డులను క్రియేట్ చేయాలని చూస్తోంది.

# మహిళలు తలుచుకుంటే అద్భుతాలు...





ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు 6 రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడారు.

**ఎలీప్ నా మనసు దోచుకుంది**

మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడంలో ఎలీప్ చేస్తున్న కృషి నా మనసును దోచుకుంది. రమాదేవి గారు ఆమె టీం సభ్యులందరూ ఎలీప్ ద్వారా అనేకమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారు. అందుకోసం వారు హైదరాబాద్ లో ఇన్నాళ్లు చేసిన కృషి అమోఘం. అందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి**

చంద్రబాబు గారు హైదరాబాద్ లో ఎలీప్ ఏర్పాటు చేశారు. ఎలీప్ నా కళ్ల ముందు పుట్టి ఎదిగింది. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం కుప్పంలో ఎలీప్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారై మరో పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకుంటారు. స్త్రీలు శక్తిమంతులు. మగవారిని



మించి పనిచేయగలరు. నేను ఇది చేయలేను అనే భయం లేకుండా ముందడుగు వేయాలి. అప్పుడే అద్భుతాలు సాధించగలరు. సాధారణ గృహిణిగా ఉన్న నాకు చంద్రబాబు గారు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించారు. అన్నీ స్వయంగా నేర్చుకున్నాను. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేము కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు పాటుబడుతున్నాము. వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నాము. ఎలీప్ ఏర్పాటు విషయంపై ఐఏఎస్ అధికారి వికాస్ గారితో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాను. కుప్పం పరిధిలో పెద్ద పరిశ్రమలతో పాటు చిన్న తరహా పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. వాటిలో పని చేయడం ద్వారా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పిడి వికాస్ మరమ్మత్, ఏపీఎస్ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కుప్పం నియోజకవర్గ టిడిపి నాయకులు, మహిళా నాయకులు, సాంద్ర సింధు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హిందూ ధర్మంపైన, ఆలయాల పరిరక్షణపైనా...

కూల్చేస్తుంటే డిప్యూటీ సీఎంగా ఉండి కూడా ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఫైర్ అయ్యారు. ప్రసిద్ధ కాశినాయన క్షేత్రంలో కూల్చివేతల నేపథ్యంలో ఈ మేరకు జగన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టారు. "దేవుడు అంటే భక్తి, భయం ఉన్నది ఎవరికి? ఎవరి హయాంలో ఆధ్యాత్మిక శోభ విలసిల్లింది? ఎవరి హయాంలో హైందవ ధర్మాన్ని పరిరక్షించారు? కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రసిద్ధ కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలు, రాష్ట్రంలో ఆలయాలపైన, హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులకు ప్రత్యక్ష సాక్ష్యాలు కావా? అటవీ ప్రాంతంలో ఉన్న కాశినాయన క్షేత్రంలో నిర్మాణాల నిలిపివేత, వాటి తొలగింపుపై 2023 ఆగస్టు7న కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆదేశాలు ఇచ్చినా, ఆ క్షేత్ర పరిరక్షణకు మా ప్రభుత్వం నడుంబిగించిన మాట వాస్తవం కాదా? అదే నెల ఆగస్టు 18, 2023న అప్పటి కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ గారికి ముఖ్యమంత్రి హోదాలో నేనే స్వయంగా లేఖరాసి కాశినాయన క్షేత్రం ఉన్న 12.98 హెక్టార్ల భూమిని అటవీశాఖ నుంచి మినహాయించాలని, ఆ క్షేత్రానికి రిజర్వ్ చేయాలని, దీనికోసం ఎలాంటి పరిహారం కోరినా, ఎలాంటి ఆంక్షలను విధించినా తు.చ.తప్పక పాటిస్తామని లేఖలో చాలా స్పష్టంగా చెప్పాం. మా ప్రయత్నాలతో కేంద్రం తన చర్యలను నిలుపుదల చేసింది. మా ఐదేళ్ల పాలనలో కాశినాయన క్షేత్రానికి వ్యతిరేకంగా ఎవ్వరూ ఒక్క చర్యకూడా తీసుకోలేదు. ఆలయాలపట్ల, ఆధ్యాత్మిక కేంద్రాల పరిరక్షణపట్ల మాకున్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది. మరోవైపు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల నుంచే ఇదే కాశినాయన క్షేత్రంలో ఏం జరిగిందో రాష్ట్రం అంతా చూస్తోంది. ఒక ప్రసిద్ధ క్షేత్రంపై బుల్డోజర్లు నడిపి కిరాతకంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, కలెక్టర్ ఆదేశాలతో, ఆర్డీఓ పర్యవేక్షణలో కూల్చివేస్తూ వచ్చారు. సీఎం చంద్రబాబు గారి ఆదేశాలమేరకు, డిప్యూటీ సీఎం పర్యవేక్షణలో ఉన్న తన పర్యావరణ, అటవీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇచ్చిన కూల్చివేత ఉత్తర్వులతో హిందూ ధర్మంపైన, ఆధ్యాత్మిక క్షేత్రాలపైన అధికార అహంకారంతో దాడిచేశారు. ఇవిగో ఆధారాలు, ఏమిటీ మీ సమాధానం? తామే ఉత్తర్వులిచ్చి, తమ చేతులతోనే కాశినాయన క్షేత్రాన్ని కూల్చేసి, వాతలు పెట్టి, వెన్నపూసిన మాదిరిగా ఇప్పుడు మాటలు చెప్తున్నారు. వీళ్ల తీరే అంత? ఈ ప్రభుత్వం వచ్చాకే వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టను దిగజారుస్తూ జరిగిన తిరుమల లడ్డూ దుష్ప్రచార వ్యవహారమైనా, టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తొక్కిసలాటలో భక్తులు మరణించిన ఘటన విషయంలోనైనా, ఇప్పుడు కాశినాయన క్షేత్రంలో గుడి కూల్చివేతలైనా.. ఇలా ఏదైనా అంతే. ఆలయాలపై వివిధ రూపాల్లో దాడులు చేసేదీ వీళ్లే, అబద్ధాలను ప్రచారం చేసేదీ వీళ్లే, మళ్లీ ధర్మ పరిరక్షకులుగా తమనుతాము చిత్రీకరించుకునేది వీళ్లే. ఒకరు ఆదేశిస్తారు, మరొకరు పర్యవేక్షిస్తారు. సనాతన వాదిగా చెప్పుకుంటూ కాశీనాయన క్షేత్రంలో కూటమి ప్రభుత్వం చేసిన దారుణాలకు బాధ్యత వహించాల్సిన, అటవీశాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం, తన శాఖ పరిధిలోనే జరిగిన ఈ కూల్చివేతలపై ఇప్పటివరకూ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. ఇలాంటి వీరికి హిందూ ధర్మంపైన, ఆలయాల పరిరక్షణపైనా మాట్లాడే హక్కు ఉందా?" అని జగన్ ప్రశ్నించారు.

# మైనింగ్ అక్రమాలపై 76 పేజీల నివేదిక..!

కర్నూలు, : వైసీపీ హయంలో ఆంధ్రప్రదేవ్ డిజిటల్ కార్పొరేషన్‌లో భారీగా అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ శాఖ విచారణలో గుర్తించారు. దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి చేరింది. అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. వైసీపీ ప్రభుత్వ హయంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరింది. నాటి వీసీ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు అక్రమాలకు బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై న్యాయపరమైన చర్యలతో పాటు క్రమశిక్షణ చర్యలకు కమిషన్ సిఫార్సు చేసింది. ఏపీ డిజిటల్ కార్పోరేషన్‌లో లేని ఉద్యోగులకు జీతాల చెల్లింపు మొదలుకుని ప్రతి వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ గుర్తించింది. ఫలితంగా నాలుగేళ్లలో దాదాపు రూ.171 కోట్ల రుపాయల దుర్వినియోగం అయ్యాయని వాటిలో రూ.139 కోట్ల రుపాయలు ఇప్పటికే చెల్లింపులు జరిపినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సీఐడీ, ఏసీబీతో దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కోట్లాది రుపాయల దుర్వినియోగమైనట్టు తేలడంతో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ వీసీ ఎండీగా వ్యవహరించిన చిన్న వాసుదేవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా విజిలెన్స్ సిఫార్సు చేసింది. వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా డబ్బు దుర్వినియోగం చేశారని ఇందుకు బాధ్యులైన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. డేటా మోటిఫ్ డిజిటల్ మీడియా, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని టెక్నో క్రియేషన్స్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట్స్, అవిసా మీడియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సాయి అడ్వర్‌టైజింగ్, ఆర్ఆర్ మీడియా అడ్వర్‌టైజింగ్, త్రీ అటమ్ లీవ్స్ సంస్థలు మోస పూరితంగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా చేశారని విజిలెన్స్ నివేదిక ఆరోపించింది. డెక్కన్ మీడియా, త్రీ అటమ్ లీవ్స్ స్టోరీ టెల్లింగ్ సంస్థలు జిఎస్టీ ఎగవేతలకు పాల్పడ్డారని, నగదు చెల్లింపుల్లో జరిగిన అక్రమాలను సరి చేయాలని విజిలెన్స్ నివేదికలో సిఫార్సు చేశారు. ఏపీడీసీ కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో సీఐడీ, ఏసీబీ దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక అభిప్రాయపడింది. ఏపీడీసీలో జరిగిన అక్రమాలకు అప్పటి వీసీ ఎండీ చిన్న వాసుదేవరెడ్డి బాధ్యుడని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఐ డ్రీమ్ వ్యవస్థాపకుడైన చిన వాసుదేవరెడ్డి ఐపాక్, ఐ డ్రీమ్ ఉద్యోగులను ఏపీడీసీలో ఉద్యోగులుగా చూపినట్టు విజిలెన్స్ నివేదిక పేర్కొంది. అనుభవం, అర్హతలు లేని వారిని ఉద్యోగులుగా నియమించడంలో వాసుదేవ రెడ్డి కీలకంగా వ్యవహరించారని విజిలెన్స్ ఆరోపిఒంచింది. లేని సంస్థలకు చెల్లింపులు జరపడం ద్వారా రూ. 37.20కోట్లను ఖర్చు చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించారని పేర్కొంది. డేటా మోటిఫ్, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని క్రియేషన్స్, త్రీ ఆటమ్ లీవ్స్, అవిసా మీడియా, సాయి అడ్వర్టైజింగ్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట?, ఆర్ఆర్ మీడియా సంస్థలకు లబ్ది చేకూర్చినట్టు పేర్కొన్నారు. ఏపీడీసీలో అక్రమాలను చూసి చూడనట్టు వదిలేసినందుకు, అర్హత లేని వారిని ఉద్యోగాల్లో నియమించినందుకు.. సెలక్షన్ కమిటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై లీగల్ యాక్షన్‌తో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. వీరిలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ సభ్యుడు ఐఆర్ఏఎస్ అధికారి మధుసూదన్ రెడ్డి, కె.హేమచంద్రారెడ్డి, పి.ప్రతాప్, ఐ అండ్ పీఆర్ సీఈ ఓ.మధుసూదన, చీఫ్ డిజిటల్ డైరెక్టర్ బ్రహ్మానంద పాత్ర, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఉద్యోగి మోతీలాల్ నాయక్, బి.నాగేశ్వరరావు. రాధాకృష్ణ, రామసుబ్బయ్య, జి.వి రామకృష్ణా రావు, ఏవీసుబ్బారెడ్డి, భూమిరెడ్డి శ్రీ వర్ధన్ రెడ్డి, పాలేశ్వరరావు, గంగవరపు సుధీర్ కుమార్, దీపిక పొన్నకంటి, శశికృష్ణ పొన్నకంటి, తాడుక అరవింద్, చెన్ను మౌనిక, నాగ భూషన్ రెడ్డి, త్రీ అటామ్ లీవ్స్ సంస్థలపై న్యాయపరమైన చర్యలకు సిఫార్సు చేశారు.

76 పేజీల నివేదిక?

డిజిటల్ కార్పోరేషన్ పేరుతో రూ.171.9 కోట్లను ఖర్చు చేయగా వాటిలో రూ.139.28కోట్లను విడుదల చేశారు. ఏపీడీసీలో జరిగిన అక్రమాలపై 76 పేజీల నివేదికను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రభుత్వానికి అందచేసింది. యాత్ర 2 సినిమాలో నటించిన మళయాళ నటుడు మమ్ముట్టికి కూడా రూ.50లక్షల రుపాయలు ఏపీడీసీ నుంచి చెల్లింపులు జరిపినట్టు విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా నిధులను మళ్ళించారు. తాత్కలిక ఉద్యోగులుగా చేరిన వారిలో కొందరికి అనూహ్య ప్రయోజనాలు చేకూర్చినట్టు నివేదిక పేర్కొంది. న్యాయమూర్తులను దూషించిన కేసులో సీబీఐ అరెస్ట్ చేసిన నిందితులకు కూడా ఏపీడీసీలో ఉద్యోగులుగా కొనసాగినట్టు విజిలెన్స్ గుర్తించింది.

# నిర్వాసితులను అన్ని విధాలుగా...

**మాయమాటలు చెప్పేవారు లేరు... :**

పునరావాసం కల్పించిన తర్వాత నిర్వాసితుల ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. నిర్వాసితులు ధైర్యంగా ఉండాలని, ఇది మీ ప్రభుత్వం... మనందరి ప్రభుత్వమన్నారు. మంచిని మంచిగా చెబితే మరింత మంచి జరుగుతుందని తెలిపారు. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయ మాటలు చెప్పేవారు అస్సలు లేరని తెలిపారు. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారని, ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా తమ కూటమి ప్రభుత్వం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఏపీ హైకోర్టులో...

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను ఆదేశించి, తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే, మాజీ మంత్రి విడదల రజని, సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారి పల్లె జాషువా, మరో ఇద్దరిపై ఏసీబీ ఈ వారం ప్రారంభంలో అవినీతి కేసు నమోదు చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్నాడు జిల్లాలోని శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్ యజమానుల నుంచి రూ. 2.2 కోట్లు వసూలు చేసినట్లు వీరిపై ఆరోపణలు ఉన్నాయి. అయితే మాజీ మంత్రి రజని ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. టీడీపీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని అన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీని వీడిన ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు వ్యక్తిగత కక్షతోనే తనపై కేసు సృష్టించారని ఆమె ఆరోపించారు. ఈ కేసులో రజనిని ప్రధాన నిందితురాలిగా పేర్కొనగా, ఆ తర్వాత ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్వీఈవో)గా పనిచేసిన పల్లె జాషువా, రజని మరిది విడదల గోపి, ఆమె వ్యక్తిగత సహాయకుడు దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చారు. వీరంతా అధికారాన్ని దుర్వినియోగం చేసి, నేరపూరిత చర్యలకు పాల్పడి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని అభియోగాలు మోపారు. స్టోన్ క్రషింగ్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ నల్లపనేని చలపతిరావు ఫిర్యాదు మేరకు... రజని ఇతర నిందితులతో కుమ్మక్కై రూ. 2 కోట్లు లంచం వసూలు చేశారని, జాషువా, గోపి ఒక్కొక్కరు మరో రూ. 10 లక్షలు చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. తమ కంపెనీ కార్యకలాపాలను కొనసాగించాలంటే తమకు రూ.5 కోట్లు ఇవ్వాలని రజని, జాషువా మొదట్లో డిమాండ్ చేశారని చలపతిరావు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విచారణ జరిపి, 2024 డిసెంబర్ 3న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా ఏసీబీ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 7A, IPCలోని సెక్షన్లు 384, 120B కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

# కోదండరామస్వామివారి...

సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామివారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.

**గోవిందరాజస్వామి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో మార్చి 30న ఉగాది ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మరణంపై ఫాస్ట్ ట్రాక్...

సానుభూతి తెలియజేస్తూ షర్మిల ట్వీట్ చేశారు. కాగా, హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు బైక్‌పై బయలుదేరిన పాస్టర్ ప్రవీణ్ దివాన్ చెరువు-కొంతమూరు హైవేపై అనుమానాస్పద రీతిలో మరణించిన విషయం తెలిసిందే.

# రుజువు చేస్తే చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తా : అంబటి



అమరావతి, : పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై అన్ని అబద్దాలే మాట్లాడుతున్నారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గురువారం ఏపీ సీఎం పోలవరం ప్రాజెక్టును సందర్శించి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనపై విరుచుకు పడ్డారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను రాంబాబు తిప్పికొట్టారు. పోలవరం నిధులు ప్రభుత్వానికి మళ్లించినట్లు రుజువు చేస్తే చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తానని అన్నారు. పోలవరాన్ని సర్వనాశనం చేసింది చంద్రబాబుయేనని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో పోలవరం పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగాయని వెల్లడించారు. అబద్దాలు చెప్పటంలో అందరికన్నా పెద్దవాడు, నిజాలు చెప్పటంలో అందరికన్నా చిన్నవాడు చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. పోలవరం నిర్మాణం సమయంలో రాష్ట్ర ప్రభుత్వమే పోలవరానికి ముందుగా డబ్బులు ఖర్చు పెట్టిన తరువాత కేంద్రం రీయింబర్ చేయడానికి కేంద్రంతో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఇందులో డబ్బుల మళ్లింపు ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు.

### బాలుపల్లికి ....

## తాగునీటి సమస్య పరిష్కారం



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: వెదురుకుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ బాలుపల్లి గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను ఎంపీపీ బండి నాగ హేమ సుందర్ రెడ్డి, ఎంపీటీసీ హరి విజయ శేఖర్ రెడ్డి ఇలా సహకారంతో స్థానిక సర్పంచ్ భారతి రాము ల ఆధ్వర్యంలో బోరు వేసి ప్రజలకు తాగినీటి సమస్యను పరిష్కరించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఎంతోకాలంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంతో మా గ్రామంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు వైసిపి నేత శివారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హేమాద్రి, టిడిపి నాయకులు శ్రీనాథ్, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

### వీకోట ఇఫ్తార్ విందులో పాల్గొన్న .....

## మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్



వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: పవిత్ర రంజాన్ మాసం ను పురస్కరించు కొని వీకోట మండల వైస్ ఎంపీపీ డాక్టర్ తమిమ్మ్ ఖాన్ ఏకే మ్యాంగో గార్డెన్ సిటీ లో గల తమ స్వగృహమునందు హిందూ ముస్లిం సోదరులకు గత సాయంత్రం 6 గం టలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమానికి పలమనేరు మాజీ శాసన సభ్యులు వెంకట గౌడ,వీకోట మండల ఎం పీపీ కే. యువరాజ్, మండలంలోని వైకాపా సర్పంచ్లు, ఎంపీటీసీలు, ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సమయం ఖాన్ గృహ ఆవరణములో రం జాన్ మాసం పురస్కరించుకొని నమాజ్ కార్యక్రమాన్ని నిర్వహించినారు,ఈ నమాజ్ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ తో పాటు వైకాపా కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున వచ్చిన వారందరికీ డాక్టర్ తమిళ్ ఖాన్ శాలువాలు, నమాజ్ టోపీలు ధరింపజేసి నమాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనం తరం వచ్చిన ప్రజానీకానికి మండల వైస్ ఎంపీపీ డాక్టర్ ఏకే తమిమ్మ్ ఖాన్ విందు భోజనము ఏర్పాటు చేసినారు.

## పలమనేరులో ఎమ్మెల్యేల సందడి



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో మరియు జిల్లా ముఖ్య నేతలతో పలమనేరు గురువారం సందడిగా మారింది. పుంగనూరులో ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించి బాధితులను వెళ్ళి పరామర్శించాలని పార్టీ ఆదేశించింది. దీంతో చంద్రగిరి, కాళహస్తి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, గురుజాల జగన్ మోహన్, మురళీ మోహన్ లు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి స్వగృహానికి చేరుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఇక్కడ అల్పాహార విందు అనంతరం ఎమ్మెల్యేలందరు కలసి పుంగనూరు నియోజకవర్గంలోని క్రిష్ణపురం గ్రామానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేలతో పాటు జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్, జయప్రకాశ్ నాయుడు, పలమనేరు కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు అర్వీ బాలాజీ తదితరులున్నారు.

### మండల కో ఆప్షన్ సభ్యుడు...

## ఏకగ్రీవ ఎన్నిక

పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: అన్నమయ్య జిల్లా పీలేరుమండలం కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి భాష మృతి చెందడం తో. గత కొంతకాలంగా మండల కో ఆప్షన్ పదవి కాళీ ఉండటంతో ఎన్నికల అధికా రులు మండల కో ఆప్షన్ ఎన్నిక డి ఎల్ డి ఓ . ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీ డీవో కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైయస్సార్ పార్టీకి చెందిన ఎస్ సయ్యద్ భాషను. ఎంపీటీసీ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ సతీష్ రెడ్డి వైస్ ఎంపీపీ ఎన్వి చలపతి. ఎంపీడీవో శివశంకర్. ఏవో రాజేశ్వరి ఎంపిటిసిలు నరసింహారెడ్డి. కిరణ్ కుమార్ నాయుడు మధుసూదన్ రెడ్డి. వెంకటరమనాయుడు అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించింది

## ఎన్డీఏ పాలనలో ప్రజలందరికీ మంచే జరుగుతుంది

## మహిళలు ఆర్థికంగా బలంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం

## 2వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి వెల్లడి







కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు గారి పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామిక వేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబు గారిపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. 2వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

**అందరికీ సంక్షేమం** ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు. కానీ చంద్రబాబు గారు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారు. ప్రజలు కాస్త ఓపిక పట్టాలి. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి. ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదు. 2019 తర్వాత చంద్రబాబు గారు అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేది. పోలవరం పూర్తయ్యేది. రాష్ట్రాన్న చంద్రబాబు గారు నిలబెడతారు. రాష్ట్రమంతటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తిచేసి అందరికీ నీరు అందిస్తారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు,పారిశ్రామివేత్తలకు తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపారు.

**డ్వాక్రాతో మహిళల జీవితాల్లో వెలుగులు** ఇక్కడికి వచ్చిన మహిళలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. మహిళలు ఒకసారి చెబితే చాలు చక్కగా వింటారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళల కోసం సీఎం చంద్రబాబు గారు అనేక పథకాలు అమలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని



చంద్రబాబు గారు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు. ఒకప్పుడు వందా , రెండు వందల కోసం ఇతరులపై ఆధారపడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు గారు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది. మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. వ్యాపారంలోకి రాకముందు నేను ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సిగ్గుపడేదాన్ని. వచ్చాక నేను ఏమైనా చేయగలను అనే ధైర్యం బిజినెస్ లోకి అడుగుపెట్టాకే వచ్చింది. మీ గౌరవం కోసం మీరు పనిచేయండి. మహిళలు తమ సంపాదనను ముందుగా వారి అవసరాలకు వినియోగించుకోవాలని నారా భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో .....

## పదిమంది నేరస్తులకి ఆరు నెలలు జైలు శిక్ష..

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్ర చందనం అక్రమరవాణా కేసులో పదిమంది నేరస్తులకు ఆరునెలలు జైలుశిక్ష,ఒక్కొక్కరి కి వెయ్యి రూపాయలు జరిమా నా విధించి న పుత్తూరు అసిస్టెంట్ కోర్ట్... 2014 సంవ త్సరంలో ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో.. క్రైమ్ నెంబర్ 114/2014 కేసు నమోద యింది.128/2019 కేసులో కోర్టు శిక్ష ఖరా రు చేయగా సదరు ముద్దాయిలు కోర్టు తీర్పును తిరుపతి స్పెషల్ కోర్టులో ఆపిల్ చేసుకోవడం జరిగింది. ఆపిల్ విచారణ సందర్భంగా కోర్టు యొక్క దర్యాప్తును పరి శీలించి పుత్తూరు అసిస్టెంట్ స్పెషల్ కోర్టు వీరికి శిక్షణ ఖరారు చేసింది.ఈ సందర్భం గా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ సమాజం లో పౌరులందరు బాధ్యత గా వ్యవహరిం చాలి. ఎఫ్ఐఆర్ అయిన ప్రతి కేసులోనూ శిక్ష పడే విధంగా పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారని,యువకులు క్రైమ్ జోలికి వెళితే కేసులు నమోదు అయ్యి జైలుకు వెళతార ని,జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తెలియజేశారు.అనంతరం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, నగరి డిఎస్పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ అప్పటి



ఎర్రచందనం కేసు నమోదు చేసిన ఎస్సై ఉమామ హేశ్వర్ రెడ్డి ( ప్రస్తుతం చిత్తూరు డి సి ఆర్ బి) తర్వాత దర్యాప్తు చేసిన ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి ( రేణిగుంట పోలీస్ స్టేషన్) ఎస్సై శ్రీని వాసంతి మరియు ప్రస్తుత ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ ను సీఐ హనుమంతప్ప లను అభినందించారు.

### పీలేరు పంచాయతీలో పోలీస్

### బందోబస్తు నడుమ.....

## వేలం పాట నిర్వహణ



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: అన్నమయ్య జిల్లా పీలేరు గ్రామపంచాయ తీకి వేలం ద్వారా 42.86 లక్షలు ఆదాయం మునుపెన్నడూ లేని విధంగా వారపు సంత దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండు జంతువధశాల వేలములు ఆదా యం వచ్చింది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీస్ బందో బస్తు మధ్య బహిరంగ వేలము జరిగినట్లు మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికా రి నాగరాజా, పీలేరు పంచాయతీ ఈవో వై గురు మోహన్,సర్పంచ్ హబీబ్ భాషా ఆధ్వర్యంలో జరిగింది.వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేర కు,పీలేరు పంచాయతీ అభివృద్ధి ధ్యేయం గా,ఎలాంటి అపోహాలు లేకుండా పంచాయ తీ కార్యాలయంలో వేలం జరిగింది.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: అన్నమయ్య జిల్లా పీలేరు రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు విస్తార విందు పీలేరు మండలం కావాలి పంచా యతీ వంటిల్లుకు చెందిన టిడిపి నేత గాలే టి శ్రీధర్ నాయుడు గురువారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో కఠిన ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు ఒక పూట భోజనం ఏర్పాటు చేయడం పుణ్యకార్యంగా భావించి ఈ కార్యక్రమం చేపట్టామని అన్నాడు, కార్యక్రమంలో నరసింహనాయుడు రోహిత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



### "పొగాకు ఉత్పత్తులకు ,.....

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి "







కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: పొగాకు ఉత్పత్తులకు మత్తు పదార్థాలకు విద్యార్థుల దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,కల్లూరు నందు "ఈగల్ క్లబ్స్ (ఎలైట్ ఏంటీ - నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ క్లబ్స్) ను సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా పాఠశాలల్లోని విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ ,హాంసు, సిగార్ ,మరియు మత్తు పదార్థాలైన మాదకద్రవ్యాలు, గంజాయి, ఓపియం , వాడటం వలన కలిగే కలిగే తీవ్ర అనర్థాలు మరియు అనారోగ్య సమస్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం,విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా చూడడం, సమాజాన్ని చైతన్య పరచడం, పాఠశాలను డ్రగ్స్ రహిత పాఠశాలగా తయారు చేయవచ్చు. తల్లితండ్రులు పిల్లల అలవట్లపై నిఘా అవసరం.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్ధులు, ఉపాధ్యాయులు రాజేంద్ర, పద్మవేణి,రాజశేఖర్,గుర్రయ్య , సైదుల్ల,ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రికార్డుల బూజు దులుపుతున్న రెవెన్యూ సిబ్బంది.

సత్యవేడు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: తిరుపతి జిల్లా సత్యవేడు రెవిన్యూకు సంబంధించిన పలురికార్డుల బూజుదులి పే పనిలో సిబ్బంది,తలమునకలయ్యారు. రికార్డు గదిలోని భూసం బంధిత రికార్డుల న్నీ వానకు తడిసి, ఎండకు ఎండి పాడవు తున్న నేపథ్యం లో రెవెన్యూ అధికారులు ఇప్పటికి మేల్కొన్నారు.ఈ క్రమంలో సులూ రుపేట ఆర్డీవో సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. గురువారం సత్యవేడు తహసిల్దార్ కార్యాలయం చేరుకుని రికార్డు గదిని తెరిచి రికార్డులన్నీ ఒక్కొక్కటిగా కార్యాలయం లోపలికి తెచ్చి గ్రామాల వారీగా రికార్డుల ను వేరు చేస్తున్నారు.28 పంచాయతీల కు సంబంధించి పాత అడంగల్సు రికార్డులను గుర్తించి ఒక క్రమ పద్ధతిలో రికార్డు గదిలో ఏర్పాటు చేయనున్నట్టు రెవెన్యూ అధికా రులు పేర్కొంటున్నారు.తద్వారా భవిష్య త్తులో రెవెన్యూకు సంబంధించి ఏ రికార్డు కావాలన్న సులువుగా గుర్తించడానికి వీలు పడుతుంది.రికార్డులు వేరు చేయడం, తని ఖీకి సంబంధించి వీడియో చిత్రీకరణ కూడా కొనసాగుతోంది.



## 27 వారాలకే పుట్టిన శిశువుకు

## అత్యాధునిక మైన వైద్యం అందించి

# పి ఈ ఎస్ ఆసుపత్రి వైద్య బృందం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: చిత్తూరు జిల్లా, ఎస్.ఆర్ పురం మండలం, జంగాలపల్లి గ్రామముకు చెందిన రోషిని, మక్బుల్ దంపతులు డెలివరీ కొరకు జనవరి 18 వ తేదీన కుప్పం పి ఈ ఎస్ ఆసుపత్రిలో అడ్మిట్ అయినారు.డాక్టర్లు రోగిని పరీక్షించి శిశువు బరువుచాల తక్కు వ ఉన్నదని,తల్లికి బిడ్డకు ఎటువంటి ప్రమాదం జరగకుండా కాపాడేందుకు తల్లికి ముందస్తు డెలివరీ ఏర్పాట్లు చేసి, ప్రసవం కల్పించారు సాధారణంగా 40 వారములు నిండిన తరువాత ప్రసవం చేస్తారు.కానీ తల్లికి 27 వారములకే నొప్పులు రావడం తో,తల్లి బిడ్డకు అటువంటి ప్రమాదం జరగ కుండా కాపాడేందుకు తల్లికి ముందస్తు డెలివరీ చేయాల్సి వచ్చింది.జనవరి 18వ తేదీన రోషిని మగ శిశువుకు జన్మనిచినది. ఆ సమయములో శిశువు యొక్క బరువు కేవలం 740 గ్రాములు మాత్రమే.కానీ శిశు వు అనేక రుగ్మతలు (ఇన్ఫెక్షన్,అధిక రక్త హీనత,శ్వాసకోశ వ్యాధులు,కన్ను అభివృ ద్ధి లోపం,నరాల బలహీనత, అతి తక్కు వ బరువు కలిగిఉండడంతో శిశువును వెంట నే ఎన్ ఐ సి యు కి తరలించి శిశువు ను అత్యుత్తమ వైద్య,నర్సింగ్ సంరక్షణతో పాటు శిశువు ఆరోగ్య పరిస్థితినితల్లిదండ్రు లకు నిరంతరం వివరించడం జరిగినది. ఆసుపత్రి నందు సుమారు మూడునెలలు గా వైద్య సేవలు పొందుతు న్నారు. ప్రస్తు తము శిశువు బరువు 1.5 కిలోలు ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. పై వైద్య సేవలన్ని యు పిల్లల విభాగాధిపతి ( హెచ్ ఓడి )డా ?రాజేంద్ర నాయుడు,డా?హరిచంద్ర (ప్రొఫె సర్),ఎన్ ఐ సి యు ఇంచార్జి డా?దీప్తి, వైద్యబృందం ఆధ్వర్యంలో జరిగినది. పై వైద్య సేవలన్నియు మెడికల్ సూపరింటెం డెంట్ డా?సుబ్రమణ్య ఎన్.కె. మార్గదర్శక ములో చేసి విజయవంతంచేయడమైనది, నిరంతరం వైద్య సేవ లందించి తల్లీబిడ్డల ను సురక్షితంగా కాపాడిన వైద్య బృందాన్ని పి ఈ ఎస్ యాజ మాన్యం అభినందించింది.

## నేడు శ్రీ లక్ష్మీనరసింహస్వామి .....

## కౌలు భూములు బహిరంగ వేళము

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తరి, ఖుష్కి భూములను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు దేవా లయం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో 3 సంవత్స రాలు కౌలు లీజుకు బహిరంగ వేళము నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికా రులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనవచ్చు. పాటలో పాల్గొను ప్రతి పాటదారుడు పాట లో పాల్గొను ముందు రూ 1000 చెల్లించి పాటలో పాల్గొనవలెను. డిపాజిట్ చెల్లించి న వారు పాటకు అర్హులు కాదు. హిందూ దేవాలయ ధర్మాదయ శాఖ షరతుల ప్రకారం వేలంపాట నిర్వహించబడును.

## విద్యుత్ దీపాలతో ....

## మెరిసిపోతున్న జామియా మసీదు



వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: వీకోట మండలం వీకోట పట్టణంలోని జామియా మసీదు నందు రంజాన్ పండుగ సందర్భంగా మసీదు మొత్తాన్ని, మసీదు వీధులను విద్యుత్ దీపాలతో పెద్ద ఎత్తున అలంకరణ చేయించినారు. గురు వారం రోజు రాత్రి పూర్తిగా ముస్లిం సోదరులు జామియా మసీదు వద్దకు చేరుకొని ష.. ఖే.... ఖదర్... రాత్రి అంతా (జాగారం) చేస్తారని, అల్లా దేవుడిని ప్రార్ధనలు చేసుకుంటూ.... తమ బాధ సాధకులు, కష్టనష్టాలు.... అన్ని తొలగిపోవాలని అల్లాకు నమాజులు చేసుకుంటూ ఉదయాత్ పూర్వం వరకు రాత్రంతా జాగారం చేస్తామని మసీదు ధర్మకర్తలు మరియు ముస్లిం సోదరులు తెలియజేసినారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి...

## విగ్రహానికి సి సి కెమెరాలు ఏర్పాటు

శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం లోని గట్టూరు గ్రామంలో వుండు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి సి సి కెమెరాలు ఏర్పాటు చెయ్యడాని కోసం బహుజన సేన రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప, గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, చొరవతో గట్టురు గ్రామంలో ఉండు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి చుట్టూ పరిరక్షణ కోసం సి సి కెమెరా ఏర్పాటు చేయడం జరిగినది.



## ఇటీవల పుంగనూరులో వైకాపా నేతల చేతిలో .....

## హత్యకు గురైన టిడిపి కార్యకర్త కుటుంబాన్ని

# పరామర్శించిన చిత్తూరు జిల్లా ఎమ్మెల్యేలు

పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: పుంగనూరు నియోజకవర్గంలోని చంద్రమాకుల పల్లి పంచాయతీ క్రిష్ణపురం గ్రామంలో ఇటీవల వైకాపా నేతల దాడిలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణకు చిత్తూరు ఇన్చార్జ్ మంత్రి రాం ప్రసాద్ రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, గురజాల జగన్మోహన్, మురళీమోహన్ లు నివాళులర్పించారు. ఆ మేరకు కృష్ణాపురం గ్రామంలో గురువారం జరిగిన దినకర్మ కార్యక్రమానికి వారు హాజరై రామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జరిగిన మీడియా



సమావేశంలో ఇంచార్జ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రసంగించారు. ఈ సంతాప కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు సి. ఆర్. రాజన్, పుంగనూరు నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ చల్లా బాబు, యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబులతో పాటు పలువురు జిల్లా నాయకులు ఉన్నారు.

## యువతి మిస్సింగ్ పై తక్షణమే స్పందించిన .....

# సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం





మహారాల స్నేహ ( 26)
D/o మహారాల నాగరాజు
పాండూరు కొత్త హరిజనవాడ
వరదయ్యపాలెం మండలం

వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం లోని పాండూరు గ్రామపంచాయతీకి చెంది న మహారాల స్నేహ (26)25వతేదీ సూళ్లూ రుపేట కు ఆసుపత్రికి వెళ్లిన యువతి తిరి గి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారు తో సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేస్ నమోదయింది. దీనిపై స్పందించిన స్థానిక సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు కోనేటి ఆది మూలం తిరుపతి జిల్లా ఎస్పీ కలిసి తక్షణ మే కేసు విచారణను చేపట్టాల్సిందిగా కోరా రు. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ. తల్లి దండ్రులు ఎలాంటి కంగారు పడాల్సిన అవ సరం లేదని కేసును సత్వరమే పరిష్కరిం చేందుకు అన్ని విధాల సహాయ సహకారా లు అందిస్తారని ఎస్పీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు

# వేసవిలో చేపట్టాల్సిన చర్యల పై దృష్టి సారించింది

## మౌలిక సదుపాయాల కల్పన విషయంలో రాజీ పడొద్దండి...

## అధికారులకు సూచించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు (ఢిల్లీ),చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: రాష్ట్రంలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి.., ఎండ వేడిమి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తోంది. నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు పరిధిలో వేసవిలో చేపట్టాల్సిన చర్యల పై అధికారులు దృష్టి సారించాలనీ చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఉమ్మడి చిత్తూరు జిల్లా యంత్రాంగానికి ఓ ప్రకటన లో సూచించారు. మౌలిక సదుపాయాల కల్పన విషయంలో అధికారులెవరూ రాజీ పడొద్దంటూ తెలియజేసారాయన.ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..., రాష్ట్ర అభివృద్ధి, చిత్తూరు పార్లమెంట్ ప్రగతే ధ్యేయంగా క్వశ్చన్ అవర్లో.. తన వాణిని పార్లమెంటులో వినిపిస్తున్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఆయన పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీకి.., చిత్తూరు పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహ కారాల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తూ.. ఆంధ్రప్రదేశ్ పున రుజ్జీవనానికి సహాయసహకారాలు అందిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనికి కేంద్ర మంత్రులు కూడా సానుకూలంగా స్పందిం చి..,ఏపి అభ్యున్నతికి తోడ్పాటునందిస్తా మని భరోసా ఇస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.కర్తవ్య




నిర్వహణలో చిత్త శుద్ధితో వ్యవహరించే చిత్తూరు పార్ల మెంటు సభ్యులు... తన చిత్తూరు పార్ల మెంటు నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వ్యవహరిస్తున్నారు. వేసవి నేప థ్యంలో చిత్తూరు పార్లమెంటులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తాను ఢిల్లీలో ఉన్నా... ఏడు నియోజకవర్గాల శాసనస భ్యులతో టచ్ లో ఉంటూ.. నియోజక వర్గాల అభ్యున్నతికి తన వంతు సహకారా న్ని అందించేందుకు వెనుకాడలేదాయన. ఎమ్మెల్యేలు, అధికారుల సమన్వయంతో.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు న్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారిగా పరిపా లనలో అపార అనుభవం ఉన్న ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు... చిత్తూరు పార్లమెంటు లోని ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ..,దూర దృష్టితో సమస్య లకు చెక్ పెడుతున్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశ యానికి అనుగుణంగా పనిచేస్తున్నానని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి పనిచేయడమే తనకు ఇష్టమన్నారు. అందుకు తగ్గట్టే ప్రణాళికలను సిద్ధం చేసుకుని.., ప్రజలకి చ్చిన హామీలను నెరవేర్చే దిశగా ముందు కు సాగుతున్నట్లు చెప్పారు ఎంపీ దగ్గుమళ్ళ.

# లిక్కర్ స్కామ్ డొంక కదులుతోంది...

రాజమండ్రి : వైసీపీ అధినేత జగన్ కు లిక్కర్ స్కామ్ మెడకు చుట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిక్కర్ స్కామ్ లో దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల మేరకు కుంభకోణం జరిగినట్లు నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు లోక్ సభలో ప్రస్తావించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ స్కామ్ పై వేగంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. లిక్కర్ స్కామ్ పై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరాలా? లేక సిట్ ను ఏర్పాటు చేసి విచారణ చేయించాలా? అన్న దానిపై చంద్రబాబు నేడో, రేపో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈరోజు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి చర్చించడం కూడా దీనికి ప్రాధాన్యత లభించింది. గత జగన్ హయాంలో వైసీపీ ప్రభుత్వమే లిక్కర్ షాపులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించింది. లిక్కర్ షాపులను నిర్వహించడమే కాకుండా కేవలం నగదు లావాదేవీలను మాత్రమే అనుమతించింది. ఐదేళ్ల పాటు డిజిటల్ లావాదేవీలను అనుమతించకపోవడంతో అప్పటి కూటమి పార్టీల నేతలు కూడా లిక్కర్ లో భారీగా స్కామ్ జరిగినట్లు ఆరోపించారు. ఎన్నికలకు ముందు విమర్శలు చేశారు. నగదును మందుబాబుల నుంచి వసూలు చేసి వైసీపీ అగ్రనేతల ఇళ్లకు వెళ్లాయన్న ఆరోపణలు కూడా చేశారు. ఇదే సమయంలో లిక్కర్ దుకాణంలో అప్పుడు ప్రయివేటు సిబ్బందిని నియమించడంతో పాటు వారు వసూలు చేసిన డబ్బులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై విచారణ ప్రారంభం కానుంది. అయితే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాత్రం దుబాయ్ కు నాలుగు వేల కోట్ల రూపాయలు మద్యం ద్వారా వచ్చిన డబ్బులు పంపారని, మనీలాండరింగ్ కు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేయడమే కాకుండా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని ఆయన కోరడంతో ఇప్పుడు ఈడీ, సీబీఐ చేత దర్యాప్తు చేయించుతారా? లేక రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా సిట్ ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టి చర్యలు చేపడుతుందా? అన్నది నిర్ణయం జరగకపోయినా రెండు మూడు రోజుల్లోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

## కుప్పంలో ఘనంగా....

## రామ్ చరణ్ జన్మదిన వేడుకలు



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 27: కుప్పం పట్టణంలో ఘనంగా నియోజకవర్గ రామ్ చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్వ ర్యంలో శ్రీ ప్రసన్న



తిరుపతి గంగమ్మ దేవాల యంలో రామ్ చరణ్ పేరుతో పూజా చేస్తూ పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ జై చరణ్ నినాదంతో బారి కేక్ కట్టింగ్, అన్న దానం చేశారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్,సీనియర్ నాయకుడు పవన్ మహేష్ రూపేష్ పూలు శేఖర్ రాంచరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్ చెర్రీ, శ్రీకాంత్ ,బాలాజీ, వినీత్, వాసు,నూరు భాయ్,నవీన్ రవి తదితరులు పాల్గొనారు.

## ఆర్డీఓ కార్యాలయంలో ....

## వీఆర్వోలు సర్వేయర్లకు శిక్షణ తరగతులు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి27: కుప్పం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం లో నియోజవర్గంలోని సర్వే యర్లకు నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు.గురువారం శిక్షణ తరగతు లలో ఆర్డీవో శ్రీనివాసరాజు రీ సర్వే, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన రెవెన్యూ సమస్యలపై శ్రద్ధ వహించి త్వరి తగతిన పూర్తి చేయాలని తెలియజేశారు.

## నాకు న్యాయం చేయండి

## రక్షించాల్సిన పోలీసులే -నన్ను బెదిరిస్తున్నారు



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 27: పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి: మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ మీడియా ముందు కన్నీళ్లు పెట్టారు. తొమ్మిదేళ్ల క్రితం మా పిన్నమ్మ గంగులమ్మ ఆర్థిక అవసరాల నిమిత్తం నక్లెస్ కుదువ పెట్టుకుంది, దానికి వడ్డీ మొదలు కొట్టకుండా వేలానికి వస్తే నేను సహాయం చేసి సేటుకే నగను అమ్మి మిగిలిన నగదు ఆమెకు తీసి ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఆమె కొడుకు కోడలు విజయ్ ఉషారాణిలు ఆ నగ నా వద్దే ఉంది అని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు నేను జరిగిందంతా చెప్పిన వినకుండా అయితే నాకు అయినా తెచ్చి లేదా నీకు చెందిన ఇల్లు అయినా వాళ్ళకి రాసిచ్చాయంటూ పోలీస్ స్టేషన్లో నాగరాజు అనే సార్ అభ్యంతరకర భాషలో నన్ను మాట్లాడుతూ కనీసం మహిళ అనే గౌరవం లేకుండా హుకుం జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేసారు. నాకు భర్త పిల్లలు ఎవరూ లేరు ఒంటరి మహిళను కనీసం పెన్షన్ కూడా రాలేదు ఏ రోజుకు ఆరోజు కూలి పనులు చేసుకుంటే పూట గడుస్తుంది నేను ఎక్కడ నగతెచ్చివ్వాలి ఉన్న ఇల్లు వాళ్లకి రాశి ఇవ్వాలి అంటూ కన్నీళ్లు పెట్టారు. దయచేసి జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్ ఈ విషయాన్ని పట్టించుకోని నాకు న్యాయం చేయాలసిందిగా కోరారు.

## జేఈఈ డ్రెస్ కోడ్...

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ తుది విడత పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 2, 3, 4, 7, 8, 9 తేదీల్లో ఈ పరీక్షలు జరుగనున్నాయి. రోజుకు రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్టు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 8వ తేదీన పరీక్ష మొదటి షిఫ్టులో మాత్రమే జరగనుంది. అలాగే ఏప్రిల్ 9న పేపర్ 2ఏ (బీఆర్క్), పేపర్-2బి (బిప్లానింగ్, పేపర్ 2ఎ, బి (బీఆర్క్, బి ప్లానింగ్) పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనుంది.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036